# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

NOVEMBER - 2001

# సంక్షిప్త వార్తలు

సహో. ఐరారైస్ గారు భారతీయ కాలమాన ప్రకారం 2001 అక్టోబరు 11వ తేదీ ఉదయం అమెరికాలో మృతిజెందిరి. అమెరికా కాలమాన ప్రకారం ఆయన 10వ తేదీ రాత్రి కారు ప్రమాదములో చిక్కుకొని వెంటనే ప్రాణములు విడిచిరి. ప్రభువు సన్నిధిలో నుండుటకు దేహమును చాలించిరి. ఆయన వయస్సు 84 సంవత్సరములు.

భారతదేశములో నేడు క్రీస్తు సంఘము ప్రజ్వరిల్లుతు వ్యాపించు చున్నదంటే దానికి ఐరారైస్ గారే మూలకారకులు. 1963వ సంవత్సరములో అప్పటికి కెనడా దేశములో సువార్త పని చేయుచున్న జె.సి. బెయిలీ గారిని భారతదేశము వచ్చుటకు ప్రోత్సహించి పంపించినది సహోదరులు రైస్‌గారే. మరియు రైస్ గారు వ్రాసిన బేసిక్ బైబిలు కోర్సు ద్వారానే ఆంధ్రప్రదేశ్‌లో తొలుత క్రీస్తు సంఘము ఆరంభమయ్యింది. బేసిక్ బైబిలు కోర్సు చదివి మొట్టమొదట జాషువా గూటం గారు 1964లో క్రీస్తు సంఘ సభ్యులయ్యారు. నాటినుండి క్రీస్తు సంఘము ఆంధ్రప్రదేశ్ అంతటా వ్యాపించి యున్నది. రైస్ గారు వ్రాసిన బేసిక్ బైబిలు కోర్సును ఇప్పుడు లక్షలాది ప్రజలు భారతదేశంలో తెలుగు, ఒరియా, ఇంగ్లీషు భాషలలో చదువుచున్నారు. మరియు ఆ కోర్సు ప్రపంచమంతటా 17 భాషలలోనికి తర్జుమా చేయబడియున్నది. ఈ మధ్య అది రష్యాలో కూడ ప్రవేశపెట్టబడినది.

రైస్ గారు గత 5-6 సం॥లలో పలుమార్లు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిరి. జాషువా గారితో కలిసి పనిచేసిరి. శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి మరియు నిజామాబాద్ జిల్లాలలో ఆయన జాషువా గారితో కలిసి పనిచేసిరి. 1996లో డెల్టా ప్రాంతములో సంభవించిన తుఫాను సందర్భముగా ఆయన వచ్చి పలు గ్రామములు దర్శించి సహాయ సహకారములందించిరి. ఆయన చేసిన సేవనుబట్టి అనతి కాలములోనే అనేక వేలమందికి ప్రియులైరి.

రైస్ గారు గొప్ప బైబిల్ పండితులు. సత్యమునకై చివరివరకు పోరాడిన గొప్ప యోధుడు. భారతీయుల మంచి మిత్రుడు, శ్రేయోభిలాషి. ఆయన విడిచి వెళ్లిన భార్యకు, పిల్లలకు, మనుమలకు ఆదరణ కల్గునట్లు ప్రార్థించమనవి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 నవంబర్ 2001 సంచిక 4


# పాపము యొక్క పర్యవసానము

## (The Consequence of Sin)

పాపమనగా యేమిటో యిదివరకే మనం నేర్చుకొనియున్నాము. ఆజ్ఞాతిక్రమమే పాపమనియు, విశ్వాసమూలము కానిది యేదో అది పాపమనియు, సకల దుర్నీతియు పాపమనియు మనం తెలిసికొనియున్నాము. అయితే "దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయమును విడిచి హృదయపూర్వకముగా దుష్క్రియలు చేయుదురు" (ప్రసంగి 8:11). పాపమునకు శీఘ్రముగా శిక్ష కలుగకపోవచ్చును గాని, శిక్ష మాత్రము తథ్యము.

మానవుడు పాపము చేసిన నాటినుండి దాని ఫలితమును అనుభవించు

చునేయున్నాడు. మానవుని పాపమువలన "సృష్టియావత్తు ఇదివరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవవేదన పడుచునున్నదని యెరుగుదుము" (రోమా 8:22). ఏదెనులో ఆదాము హవ్వలు పాపముచేయగా దేవుడు ఆదాముతో, "తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడియున్నది. అది ముండ్లపొదలను గచ్చపొదలను నీకు మొలిపించును. పొలములోని పంట తిందువు. నీవు నేలకు తిరిగి చేరు వరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు; ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను". "ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో నీవు పిల్లలను కందువు" అని చెప్పెను (ఆది.కా. 3:16-19). పాపము వలన ఆదాము హవ్వలు ఏదెను వనము నుండి తరిమివేయబడిరి, మరియు జీవ వృక్షము నుండి వేరుచేయబడిరి. అందువలన భౌతిక మరణము సంభవించెను. ఈనాడు ఎవరు ఎక్కడ మరణించినను అది ఆదాము హవ్వల పాపము యొక్క పర్యవసానమే. "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను, గనుక మనుష్యుని ద్వారా మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, అలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1 కొరింథీ 15:21-22). ఈ లోకంలో యున్న దుఃఖము, రోగములు, శ్రమలు, బాధలు, మరణము వగయిరా అన్నియు ఆదాము చేసిన పాపము యొక్క పర్యవసానమే. మరియు మన స్వకీయ పాపముల వలన వాటిని మరింత ఉధృతము చేసికొనుచున్నాము. యిది పాపము వలన కలిగే తాత్కాలిక శిక్ష

## ఆత్మీయ మరణం

అయితే పాపమువలన కలిగే అసలైన శిక్ష నిత్యమైనది. పాపము వలన కలుగు జీతము మరణము అని బైబిలు చెప్పుచున్నది (రోమా 6:23). యిది దేవుని నుండి నిత్యము వేరైపోవుటను సూచించుచున్నది. దేవుడు ఆదాముతో

ఏదెను వనములోని "మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరునికాజ్ఞాపించెను" (ఆది.కా. 2:17). నరుడు నిషేధించిన ఫలములను తినిన దినముననే భౌతికంగా చావలేదుగాని ఆత్మీయంగా ఆ దినమందే దేవుని నుండి వేరై చనిపోయాడు. గనుక ఆదాము హవ్వల పాపము వలన మానవజాతికంతటికీ భౌతిక మరణం సంక్రమించితే, ప్రతివాడు తాను చేసుకొనిన పాపమువలన ఆత్మీయమరణము నొందును. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందు వలన మరణము అందరికిని సంప్రాప్తమాయెను" (రోమా 5:12).

"పాపము చేయువాడే మరణమునొందును; తండ్రి యొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోషశిక్షను తండ్రిమోయడు; నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును. అయితే దుష్టుడు తాను చేసిన పాపములన్నిటిని విడిచి, నాకట్టడలన్నిటిని అనుసరించి న్యాయము జరిగించిన యెడల అతడు మరణమునొందడు, అవశ్యముగా అతడు బ్రదుకును" అని యెహోవా దేవుడు సెలవిచ్చియున్నారు (యెహెజ్కేలు 18:20-21). పాపముల విషయమై మారుమనస్సు పొందనియెడల, యేసు దేవుని కుమారుడని నమ్మనియెడల అందరు నశింతురు (లూకా 13:3; యోహాను 8:21,24).

## నిత్యశిక్ష

పాపమువలన నిత్యశిక్ష కలుగును. "భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును. దుష్కార్యము చేయు ప్రతిమనుష్యుని ఆత్మకు మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ శ్రమయు వేదనయు కలుగును" (రోమా 2:8-9). "పిరికి వారును, అవిశ్వాసులును అసహ్యులును నరహంతకులును వ్యభిచారులును

మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండుగుండములో పాలుపొందుదురు. ఇది రెండవ మరణము" (ప్రక 21:8). "వారు యుగయుగములు రాత్రింబగళ్లు బాధింపబడుదురు" (ప్రక 20:10). "నరకమున వారి పురుగుచావదు; అగ్ని ఆరదు" (మార్కు 9:48), "వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" (మత్తయి 25:46). ఈ లేఖనములను బట్టి యేమి అర్థమగుచున్నది ? పాపమువలన కలిగే శిక్ష నిత్యమైనది; అది ఘోరమైనది.

"అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడిన యెడల సమాధాన పరచబడినవారమై ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:8-10).

## క్రీస్తు రక్తము ద్వారా విమోచన

మానవుడు నిత్యశిక్ష ననుభవించాలని దేవుడు కోరుటలేదు. సరిగదా, "ఆయన మనుష్యులందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2:4). "దేవుడొక్కడే దేవునికిని నరునికిని మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు. ఈయన అందరి కొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను" (1 తిమో 2:5). యేసుప్రభువు తన పరిశుద్ధ రక్తముచేత మనలను పాపమునుండి విమోచించియున్నారు. ఏలయనగా "రక్తము చిందింపబడకుండా పాపక్షమాపణ కలుగదని సామాన్యముగా చెప్పవచ్చును" (హెబ్రీ 9:22). అయితే "ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట

అసాధ్యము" (హెబ్రీ 10:4). అందువలన యేసుక్రీస్తు "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతోకాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:12). మనకు రక్షణ మార్గమును తెరిచెను. అందుకే "వెండి, బంగారముల వంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునకు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగరా ?" యని రక్షింపబడిన క్రైస్తవులకు అపొ.పేతురు హెచ్చరిక చేసాడు (1 పేతురు 1:18-19).

## పాపక్షమాపణ పొందాలంటే....

ఇప్పుడు మనము పాపముల నుండి విముక్తులము కావాలంటే, మన కొరకై సిలువపై బలియైన యేసుప్రభువు నందు విశ్వాసముంచాలి. యేసుప్రభువు తన కాలమునాటి యూదులతో, "మీరు క్రిందివారు, నేను పై నుండావాడను; మీరు ఈలోక సంబంధులు, నేను ఈలోక సంబంధుడనుకాను. కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయన నని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను" (యోహాను 8:23-24). మరల మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురని ఆయన చెప్పెను (లూకా 13:5). ఇంకా, "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" అని ఆయన చెప్పెను (మత్తయి 10:32-33). "యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతికలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9-10). చివరిగా క్రీస్తు సువార్తను "నమ్మి, బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని

వానికి శిక్ష విధింపబడును" అని ఆయన చెప్పెను (మార్కు 16:16).

ఇప్పుడు యేసుప్రభువు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయన యందలి విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవాడు పాపవిముక్తు డగును. అతడు రక్షింపబడినవాడై క్రీస్తుచే క్రీస్తు సంఘముతో చేర్చబడి మరణపర్యంతము నమ్మకముగా యున్న యెడల నిత్యజీవకిరీటాన్ని పొందును.

"కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీర మందు పాపమును ఏలనియ్యకుడి. మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి. అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి" (రోమా 6:12-13). దేవుడు మిమ్మును దీవించునుగాక !!

# తప్పుచేయవద్దు
## (Don't make a Mistake)

దేవుడు ఈ విశ్వాన్ని సృజించి, భూమిపై మానవుని చేసిన నాటినుండి మానవుడు అనేక తప్పులు చేయుచువచ్చాడు. వాటిలో కొన్ని తీవ్రమైనవి, మరికొన్ని అంత తీవ్రమైనవికావు. ప్రపంచ చరిత్రలో మొదటి పొరబాటును ఒక స్త్రీ చేసింది. ఆమె తల్లియైన హవ్వ. దేవుని మాటనుగాక సాతాను మాటకు ఆమె లోబడింది (ఆది.కా. 3:6).

తరువాత రెండవ తప్పును ఆదాము హవ్వల మొదటి కుమారుడు చేసాడు. అతని పేరు కయీను. "మనము కయీను వంటివారమై యుండరాదు. వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెనని" అతన్ని గూర్చి 1 యోహాను 3:12లో చదువగలము.

లోతుయొక్క అల్లుళ్లు సొదొమ పట్టణమును విడిచివెళ్లడానికి నిరాకరించి పొరబాటు చేసారు (ఆది.కా. 19:14). లోతు యొక్క భార్యకూడా దేవుని దూత యొక్క ఆజ్ఞకు అవిధేయత చూపింది. ఆమె వెనుదిరిగిచూచి ఉప్పుస్థంభమయ్యింది.

బలహీన ఘడియలో ఏశావు తన జ్యేష్టత్వాన్ని అమ్మేసుకొని పొరబాటు చేసాడు (ఆది.కా. 25:33).

ఫరోరాజును, ఐగుప్తు సైన్యమును ఆవ్వానము లేకయే ఎర్రసముద్రములో అడుగిడి మునిగిపోయారు. వారిలో ఒక్కడును చావకుండ మిగలలేదు.

మోషే కూడా ఒక తప్పు చేసాడు. అందువలన కానానులో ప్రవేశించలేక పోయాడు. బండతో మాట్లాడుమని దేవుడు మోషేతో చెప్పగా, అతడు దాన్ని కొట్టాడు. నేను మోషేను గూర్చి బోధించుచు, అతడు చేసిన తప్పును గూర్చి చెప్పుచున్నప్పుడు కొందరు మతశాఖల బోధకుల సంగతిని గూర్చి ఆశ్చర్యపడతాను. నీటిలో ముంచడమియ్యండి యని దేవుడు ఆజ్ఞాపిస్తే కొందరు నీళ్లు చిలకరిస్తారు. అట్టి వారిని గూర్చి నేను విచారిస్తాను.

రాజైన సౌలు అమాలేకీయులను సంపూర్తిగ నాశనం చేయకుండా, వారి రాజైన అగగును బ్రదుకనిచ్చినందున పొరబాటుచేసాడు. సౌలు రాజును ప్రవక్తయైన సమూయేలు ఖండించాడు. దేవుడతన్ని రాజుగా నిరాకరించాడు (1 సమూ 15:22,23).

ఉజ్జా దేవుని మందసమును ముట్టుకొని పొరబాటు చేసాడు. దేవుడతనిని తక్షణమే మొత్తాడు. అతడా మందసము ప్రక్కనే పడిచచ్చాడు ( 2 సమూ 6:7).

రెహాబాము వృద్ధుల జ్ఞానోపదేశమును నిరాకరించాడు (1 రాజులు 12:8). బెత్షెమెషువారు యెహోవా మందసమును తెరచి చూచి తప్పుచేసారు. దేవుడు వారిని హతముచేసి అజనులలో ఏబది వేల డెబ్బదిమందిని మొత్తెను (1 సమూ 6:19).

రాజైన ఉజ్జియా యెహోవా ధూపపీఠము మీద ధూపమువేసి తప్పు చేసాడు. అతడు తన మరణ దినము వరకు కుష్ఠరోగియై యుండెను (2 దినవృ 26:16-21).

అన్నిటికంటె గొప్ప తప్పును అగ్రిప్పరాజు చేసాడు. పౌలుద్వారా క్రీస్తు సువార్తను విని "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే" యని అతడనెను (అపొ.కా. 26:28). అంటే అతడు క్రైస్తవుడుగా మారేటంత వరకు వచ్చాడు, గాని ఆ పనిచేయలేదు. రక్షణకు దగ్గరగా వచ్చాడుగాని, నశించాడు. అంత దగ్గరగా వచ్చి నశించిపోయినా, అది నిత్యనాశనమే. నిత్యము నాశనమై పోవుట అంటే సమాధానముతో దేవుని ముఖాన్ని చూడలేక పోవుటయే. ఆయన నుండి నిత్యము వేరుచేయబడుటయే.

ఈ క్లుప్త వ్యాసాన్ని చదువువారు తాముచేసిన పొరబాట్లను సరిదిద్దు కొందురనియే నా నిరీక్షణ. తన తప్పులను సరిదిద్దుకొని క్రీస్తులో ప్రవేశించువాడు, ఈ మంటి గృహమునుండి నిత్య నివాసములోనికి పిలువబడ్తాడు. యేసుక్రీస్తును నమ్మి, బాప్తిస్మము పొందినవాడు రక్షించబడ్తాడు. నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడ్తాది (మార్కు 16:16). తప్పు చేయవద్దు.

-- జాన్ హేరిస్

***

# మీరు క్రీస్తుసంఘమును కనుగొన్నారా ?

మనము క్రీస్తు సంఘమును గూర్చి తెలుసుకొనబోవు చున్నాము. బైబిలును మనం పరిశీలించినట్లైతే అందున్న సంఘము ఒక్కటేనని అది క్రీస్తుసంఘమేనని ఋజువు చేయుచున్నది. ప్రపంచమందున్న సమస్త మానవకోటి మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది క్రీస్తు సంఘములో చేర్చబడి అందు దేవుని ఆత్మతోను, సత్యముతోను దేవుని ఆరాధింపవలెనని దేవుడు కోరుచున్నాడు.

## 1. క్రీస్తు సంఘము ఎక్కడ నుండి వచ్చినది ?

ఇది క్రీస్తునుండి వచ్చినది. క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి (రోమా 16:16). మతశాఖలవారు సంఘములకు పెట్టుచున్న పేర్లు బైబిలునందు మనకు ఎక్కడా కన్పించవు.

ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలోనుండి వచ్చును అని ప్రవక్త ద్వారా వ్రాయబడినది (మత్తయి 2:5). ప్రభువు మార్గము సిద్ధపరచుడి ఆయన త్రోవలు సరాళము చేయుడని అరణ్యములో కేకవేయునొకని శబ్దము అని ప్రవక్తయైన యెషయా ద్వారా చెప్పబడినవాడితడే (మత్తయి 3:3). క్రీస్తు తన బిడ్డలను పరిపాలించుటకు దేవుడు తన రాజ్యమునకు క్రీస్తును అధిపతిగా నియమించెనని బైబిలు మనకు బోధించుచున్నది. ఇక్కడ రాజ్యమే సంఘమని మనం గమనించాల్సి ఉంది. అదే క్రీస్తు సంఘమై యున్నది.

## 2. క్రీస్తు సంఘమునకు నిర్మాత ఎవరు ?

మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును అని క్రీస్తు చెప్పెను (మత్తయి 16:18). నా సంఘమును కడతానని పేతురుతో ప్రభువు చెప్పుచున్నాడు. కావున దీని నిర్మాత క్రీస్తేనని బైబిలు మనకు బోధించుచున్నది.

క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడము ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువు నందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధి పొందుచున్నది (ఎఫెసీ 2:20-21). వేయబడిన పునాది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసుక్రీస్తే (1 కొరి 3:11). క్రీస్తు సంఘమునకు పునాది, నిర్మాత క్రీస్తేనని బైబిలు చెప్పుచున్నది.

## 3. క్రీస్తు సంఘమును కట్టడానికి ఎవరి రక్తాన్ని మూల్యంగా చెల్లించారు?

దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు (అ.కా. 20:28). క్రీస్తు రక్తాన్ని ధారపోసి తన సంఘమును కట్టాడు.

క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమునకు ఆయనే శిరస్సుగా యుండాలని కోరుచున్నాడు. ఆయన అన్నిటికంటె ముందుగా యున్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు! సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు (కొలస్స 1:17-18).

ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యముకంటెను, అధికారముకంటెను శక్తికంటెను ప్రభుత్వముకంటెను, ఈ యుగమునందు మాత్రమేకాక రాబోవు యుగమునందును పేరుపొందిన ప్రతినామముకంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు ! మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను ! ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది (ఎఫెసీ 1:20-23).

క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరియేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమ

గల సంఘముగాను ఆయన తన ఎదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదక స్నానముచేత దానిని పవిత్ర పరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:27).

## 4. క్రీస్తుసంఘము ఎప్పుడు ? ఎక్కడ స్థాపించబడినది ?

క్రీ॥శ॥ 33వ సం॥ములో యెరూషలేము పట్టణమునందు పెంతెకొస్తు అను పండుగ దినమునందు మూడువేల మందితో స్థాపించబడినది. మత శాఖల బోధకులు కొందరు ఇది పెంతెకొస్తు పండుగ దినమున స్థాపించబడి నందున వారి కల్పితబోధతో పెంతెకొస్తు సంఘమని మల్చారు. ఇది అసత్యమని బైబిలు బోధించుచున్నది.

## 5. సంఘ సభ్యులెట్లుండిరి ?

క్రీస్తు సంఘములో సభ్యులుకానివారు క్రైస్తవులుకారు. నిజమైన క్రైస్తవులు ఒక్క క్రీస్తు సంఘమునందే మనకు కనబడతారు అని దేవుని వాక్యం చెప్పుచున్నది.

వారుకలసి యొక సంవత్సరమంతయు సంఘములో ఉండి బహు జనములకు వాక్యమును బోధించిరి. మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి (అ.కా. 11:26). క్రొత్తనిబంధన కాలములో శిష్యులు క్రైస్తవులన బడిరి. వారు ఎలావున్నారు ?

ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొను చుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను (అ.కా. 2:47).

## 6. ప్రభువు యొక్క చిత్తమేమిటి ?

సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టియుండుడని మిమ్మును బతిమాలు

కొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి, అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపుకే దాసులు; వారు ఇంపైన మాటలవలనను ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు (రోమా 16:17-18).

అందువలన మనమికమీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను, తప్పు మార్గమునకులాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొనిపోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొని పోవుచూ అలలచేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండరాదు (ఎఫెసీ 4:14).

దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలెకాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి ! ఇందు నిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువు చిత్తమేమిటో గ్రహించుకొనుడి (ఎఫెసీ 5:15-17).

ప్రియులారా ! "క్రీస్తు సంఘము" అనునది మానవ కల్పితమైనదికాదు. అది దేవుని సంకల్పముచే కట్టబడిన సంఘమై యున్నది. దీనిని కట్టుటకు క్రీస్తు రక్తమును ధారపోశాడు, దానిని కడతానని కట్టాడు, దానికి శిరస్సు ఆయనే, ఆ సంఘమే "క్రీస్తుసంఘము" అది క్రీ॥శ॥ 33వ సం॥ములో మూడువేలమందితో ఆరంభమై నేటికి లోకములో వర్ధిల్లుచున్నది. క్రీస్తుసంఘము మాత్రమే క్రీస్తుకు ప్రధానము చేయబడినది, అది ముడుత, కళంకము, లేనిదై యున్నయెడల క్రీస్తు రెండవరాకడలో ప్రధానము చేయబడిన తన సంఘమును వివాహమాడి తన ఎదుట పరలోకములో పరిశుద్ధమైనదిగా తన తండ్రి ఎదుట నిలబెట్టుటకు ప్రభువు రాబోవుచున్నాడు.

-- పి. అబ్రాహాము
విజయవాడ.

# నీవు తడవు చేయుట ఎందుకు ?
# (Why Tarriest Thou ?)

పౌలు మార్పుజెందుటలో ఈ ప్రశ్నవేయబడింది. అననీయ అతని దగ్గరకు వచ్చి, "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసి కొనుమని చెప్పెను" (అపొ.కా. 22:16). అనేకులు తడవు చేస్తారు. వారు బాప్తిస్మము పొంది క్రైస్తవులు కావాలి. అయితే ఎందువలన అనేకులు తడవు చేస్తారు ?

మొదటిగా, మాకు కొన్ని సంగతులు తెలియవు గనుక కనిపెట్టుచున్నాం అని వారు చెబుతారు. అది నిజమే కావచ్చును. మానవులందరు పాపులేయని వారు తెలిసికోవాలి. "అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). చాలమంది వారి పాపములను ఎరుగయే యున్నారని నేననుకొనను. దేవుడు వారిని ప్రేమించుచున్నాడని వారెరుగాలి. "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). దేవుని ప్రేమను ఎరుగకుండా యున్నవారు ఎక్కువ మందియున్నారని నేనను కొనను (రోమా 5:8). దేవునికెట్లు లోబడాలో మాకు తెలియదని కొందరన వచ్చును. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" యేసు చెప్పెను (మార్కు 16:16). దానిని అందరు అర్థము చేసికొనగలరు. క్రీస్తు సంఘమును గూర్చి మాకు తెలియదని మరికొందరనవచ్చును. క్రీస్తు దాన్ని నిర్మించారు (మత్త 16:18). దాన్ని ఆయన తన స్వరక్త మిచ్చికొన్నారు (అపొ.కా. 20:28). దానికి పునాది ఆయనే (1 కొరింథీ 3:11). తలరాయి ఆయనే (ఎఫెసీ 2:19-20), ఆయనే దాని ఏకైక శిరస్సు (కొల 1:18). బాప్తిస్మము పొందిన వారిని

రక్షించి వారిని ఆయనే తన సంఘముతో చేర్చును (అపొ.కా. 2:47). యివి బైబిలు యొక్క ప్రాథమిక బోధలు. వాటిని అందరూ అర్థము చేసికొనగలరు. రక్షణ తరువాత అనుభవించే ఆనందాన్ని కొందరు ఎరుగకయున్నారా ? ఐతియొపీయ ఘనుడు బాప్తిస్మము పొంది తన మార్గమున సంతోషించుచు వెళ్లెను (అపొ.కా. 8:35-39). ఫిలిప్పియ చెరసాల అధిపతి, అతని కుటుంబము బాప్తిస్మము పొందిన తరువాత వారి గృహములో సంతోషము కలిగెను (అపొ.కా. 16:30-34). దేవుడు అజ్ఞానమును సహించడు (అపొ.కా. 17:30-31). గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? అని నిన్నడుగుచున్నాను.

రెండవదిగా, సంఘములో వేషధారులు చాలమంది యున్నారు గనుక వారు తడవు చేయుచున్నట్లు కొందరు చెప్పుదురు. లోకము యున్నంతకాలము సంఘములో వేషధారులుండక మానరు. అయితే "మనుష్య కుమారుడు తన దూతలను పంపును, వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు" అని యేసు చెప్పెను (మత్తయి 13:41). సంఘములోని వేషధారుల వలన నీవు దేవునికి లోబడకపోతే నీవు నీతిమంతునిగా తీర్చబడవు. లోకములో యున్న వారంతా తప్పు చేస్తుంటే, అదే తప్పును మనము చేయడానికి మనకు హక్కులేదు. క్రైస్తవులందరు వేషధారులు కారు. సంఘములో చక్కటి దేవుని బిడ్డలున్నారు. మనం వారిని అనుకరించుటకు ప్రయత్నించాలి. వారివలె మిగతా వారు కూడ క్రైస్తవులై ఈలోకానికి ధన్యత తేవాలి.

## మతశాఖల వలన గజిబిజి

మూడవదిగా మత విభజనల వలన అనేకులు తడవుచేయుదురు. వారు ఆయా డినామినేషన్లను చూచి, "వారిలో ఏది సరియైనదో తెలిసికొనడం కష్టం" అని చెబుతారు. మత సంబంధమైన శాఖలు ఉన్నాయి. దేవుడు వాటికి అనుమతి నియ్యలేదు. తన్ను వెంబడించు వారందరు ఐక్యంగా యుండాలని యేసు ప్రార్థించెను

(యోహాను 17:20-21). అపొస్తలులు ఐక్యత కొరకు విజ్ఞాపన చేసారు (ఎఫెసీ 4:3-6). ఆదిమ సంఘము ఐక్యతను పాటించారు (అపొ.కా. 4:32).

ఏది సరియైనదో తెలిసికోవాలంటే, మానవులు తెలిసికోగలరు. "మీరు సత్యమును గ్రహించెదరు, సత్యము మిమ్మును స్వతంత్రులునుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:32). ఏది సరియైనదో తెలిసికోవాలంటే మనం ప్రతిదినము లేఖనములను పరిశోధించాలి (అపొ.కా 17:11). అందరు సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము కలిగియుండాలని దేవుడు కోరుచున్నాడు (1 తిమోతి 2:4). బైబిలులో లేని అంశాలను గూర్చి మానవులు పెక్కు సందర్భాలలో విభజింపబడి యున్నారు (ద్వితీ 4:2; సామె 30:6; 1 కొరింథీ 4:6). ప్రమాణ పుస్తకములు, నియమావళులు, నూతన బయల్పాటులు మొదలగునవి బైబిలు వర్తమానాన్ని చులకన చేసేసాయి, తారుమారు చేసేసాయి. అవి క్రైస్తవ్యాన్ని గందర గోళంలోకి దింపేసాయి. గనుక మనం బైబిలు నొద్దకు వెళ్లుదాం. అప్పుడు మాత్రమే ఏది సరియైనదో మనం తెలిసికోగలం. భక్తి విషయాల్లో బైబిలు ఒక్కటి మాత్రమే అధికారపూరితమైనది. మనందరం దానిని బట్టియే తీర్పుపొందుదుము (యోహాను 12:48; రోమా 2:2; యోహాను 17:17).

## అసత్యము నుండి సత్యములోనికి మారాలి

నాల్గవదిగా, తమ మతాన్ని మార్చుకొనడంలో కొందరు చాల సిగ్గుపడ్తారు, గనుక తడవు చేస్తారు. అపొ.కా. 8:26-39లో మనం ఐతియొపీయ ఘనుడు మార్పుజెందుట చూస్తాము. అతడు అనేక సాకులు చెప్పుకోవచ్చును. తాను చాల ప్రాముఖ్యమైన వ్యక్తి. ప్రముఖమైన పనిమీద వచ్చి వెళ్తున్నాడు. త్వరలో యింటికి చేరుకోవాలి. అయినను బోధింపబడడానికి అతడు ఆసక్తి చూపాడు, తన జీవితంలో అవుసరమైన మార్పులు చేసుకోడానికి యిష్టపడ్డాడు. అతడు యూధా మత ప్రవిష్టుడు. అయినను అతడు మార్పుజెందాడు. క్రొత్త నిబంధన క్రైస్తవుడయ్యాడు. అతడు మార్పుజెందిన సందర్భములో సిగ్గుపడినట్లు ఎక్కడా

కన్పించదు. అతడు తప్పులో యున్నాడు. సరిగా యుండగోరాడు.

పౌలు యూదుడని మనకు తెలుసు. తన జాతివారందరికంటే యూదా మతంలో అతడు గొప్ప ప్రావీణ్యతను సంపాదించాడు. తన పితరుల పారంపర్యాచారమందు విశేషాసక్తి గలవాడు (గలతీ 1:14), గాని దమస్కుపోవు మార్గములో అతడు యేసును ఎదుర్కొన్నాడు. గొప్ప వెలుగు ప్రకాశింపగా అతడు చూడలేకపోయాడు. అతడు మారుమనస్సు నొందాడు. అన్నపానములు పుచ్చుకొనకుండా ప్రార్థించాడు. అననీయను దేవుడతని దగ్గరకు పంపారు. అననీయ వచ్చి, "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసి కొనుమని చెప్పెను" (అపొ.కా. 22:1-16). వెంటనే అతడు బాప్తిస్మము పొందెను. అతడు మతాన్ని మార్చుకొన్నాడు. సిగ్గుపడలేదు గాని క్రైస్తవుడైనందుకు గర్వించాడు.

అనేకమంది మతశాఖల తప్పులలో కప్పబడియున్నారు. వారికి సత్యము బోధింపబడింది. సత్యాన్ని వారెరుగుదురు. గాని తడవు చేస్తారు. సంఘాలు మార్చడం బాగోదనుకొంటూ వారు సంశయిస్తారు. గాని మరణం సంభవిస్తే వారేమీ మార్చుకోలేరు.

మనలో చాలమంది తల్లిదండ్రులు గతంలో మతశాఖలకు చెందినవారే. సత్యము నెరుగకముందు వారట్లుండిరి. వారు మతశాఖలలో యుండినంత మాత్రాన మనము కూడా అందులో యుండనవుసరంలేదు. ఏలయనగా మనకు సత్యము ఇప్పుడు బోధింపబడియున్నది. మన తల్లిదండ్రులకు ఆనాడు సత్యము బోధింపబడియుంటే వారు ముందే మతశాఖలను విడిచిపెట్టి యుందురు.

ఐదవదిగా, నమ్మకమైన క్రైస్తవులుగా యుండలేమెమోయనే భయం చొప్పున అనేకులు తడవు చేస్తారు. అయితే క్రైస్తవ జీవితాన్ని మనకు మనమే జీవించలేము. మనలను బలపరచువాని యందే సమస్తమును చేయగలము

(ఫిలిప్పీ 4:13). ఆయన తన భక్తులను శోధనలో నుండి తప్పించగలడు (2. పేతురు 2:9; 1 కొరింథీ 10:13). క్రైస్తవుడు పాపము చేసినప్పుడతడా పాపమును గూర్చి మారుమనస్సు పొంది, దేవుని యెదుట దానిని ఒప్పుకొని క్షమాపణ నడిగిన యెడల ఆయన క్షమించును (1 యోహాను 1:9). యాకోబు 5:16, అపొ.కా. 18:21-24ను కూడా చదువండి. దేవుడు తన బిడ్డలు క్షమింపబడే అవకాశమిచ్చినందుకు ఆయనకు స్తోత్రములు! క్రైస్తవులు పాపము చేయగలరు (1 యోహాను 1:8,10). అయితే మనం క్షమాపణ పొందే విధానాన్ని కూడా ఆయన యిచ్చియున్నాడు. అదే లేకపోతే మనమెక్కడ ఉందుము ?

## ఇంకొకరి కొరకు కనిపెట్టకూడదు

ఆరవదిగా, వారు యితరుల కొరకు కనిపెట్టుచు తడవు చేస్తారు. అది ప్రమాదకరం, క్రైస్తవుడై ఎందుకు కనిపెట్టకూడదు ? నీవు సువార్తకు లోబడితే యితరులు నిన్ను బట్టి ప్రోత్సహించబడుదురు. నీవు వారి కొరకు కనిపెట్టుచుండగా, వారు నీ కొరకు కనిపెట్టుచున్నారేమో! "మీ సొంత రక్షణను భయముతోను వణకుతోను కొనసాగించుకొనుడి" యని పౌలు వ్రాసెను (ఫిలిప్పీ 2:12). రక్షణ వ్యక్తిగతమైన సంగతి. నీ కొరకు ఇంకొకరు దేవుని ఆజ్ఞలకు లోబడలేరు. "మూర్ఖులైన ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడి" యని చెప్పి పేతురు హెచ్చరించాడు (అపొ.కా. 2:40). నీవు కనిపెట్టలేనందున సంతోషిస్తావు. "తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు, తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు, ప్రభువుచేత నిర్దోషియని ఎంచబడినవాడు ధన్యుడు" (రోమా 4:7-8).

చివరిగా, ఇంకా చాల సమయమున్నదని తలస్తూ అనేకులు తడవు చేస్తారు. రేపేమి సంభవించునో మనకు తెలియదు (సామె 27:1). మన జీవము అంతలో కనబడి అంతలో మాయమైపోవు ఆవిరి వంటిది (యాకోబు

4:14). మనకు మరణానికి మధ్య ఒక్క అడుగే యున్నది (1 సమూ 20:1). రాత్రి వచ్చుచున్నది అప్పుడు ఎవడును పనిచేయలేడు (యోహాను 9:4). మనం సమాధిని సమీపించేవరకు కనిపెట్టినయెడల రక్షణను గూర్చి చాల ఆలస్యము చేసినవారమవుదుము (ప్రసంగి 9:11). ఫేలిక్సు అగ్రిప్ప కనిపెట్టారు (అపొ.కా. 24:25, 26:28). వారెన్నడైనా క్రైస్తవులైనట్లు రుజువు యేమీ లేదు. ఇదియే రక్షణ దినమని పౌలు చెప్పాడు (2 కొరింథీ 6:2). ఈరోజే, ఇప్పుడే క్రైస్తవుడవు కమ్ము. తడవు చేస్తే నరకంలో పడ్తావు !!

-- జాన్ స్టేస్

# యేసుక్రీస్తు బోధించిన రీతి
# (How Jesus Christ Taught)

ఈ లోకమందు ఉద్భవించిన బోధకులందరికంటె యేసుక్రీస్తు గొప్ప బోధకుడు. ఆయన చేసిన అద్భుతములు గొప్పవి, గాని ఆయన చేసిన బోధలు మరింత గొప్పవి. ఈ పాఠములో ఆయన చేసిన బోధనలను గూర్చి కొన్ని ముఖ్యాంశములను గమనింతము.

## ఉపమానములతో

యేసుక్రీస్తు చాల సులభ పద్ధతిలో ప్రజలకు బోధించెను. సామాన్య

ప్రజలు కూడ అర్థము చేసికొన గల్గునట్టి మాటలను ఆయన ఉపయోగించి బోధించెను. వారందరు యెరిగిన సంగతులనే ఉదాహరణలుగా ఆయన ఉపయోగించెను. ఆయన గొప్ప గొప్ప ఆత్మీయ సూత్రములను ఉపమానముల నుపయోగించి బోధించెను. ఉపమానమనగా పరలోక సంబంధమగు ఒక చిన్నకథయని మనము చెప్పుకొనవచ్చును. తప్పిపోయిన కుమారుని గూర్చి యేసు చెప్పిన కథ మనందరము ఎరిగినదే. ఆ కథలో చిన్న కుమారుడు తన తండ్రినుండి తనకు వచ్చు ఆస్థిని బలవంతముగా తీసికొని దూరదేశమునకు పోయి ఆ డబ్బంతటిని వ్యర్థముగా ఖర్చుపెట్టి చివరకు తినడానికి తిండి లేకపోగా తాను మేపు పందులుపొట్టును తినుట మట్టుకు ఆశించెను. అయితే బుద్ధి వచ్చినప్పుడు అతడు తన తండ్రియొద్దకు తిరిగి వెళ్లి, క్షమించుమని, తన దాసులలో ఒకనిగా నుంచుకొనుమని తండ్రిని బతిమాలెను. తండ్రి అయితే మహాసంతోషముతో వానిని తన కుమారునిగా చేర్చుకొనెను (లూకా 15:11-32). ప్రజలను సంతోషపెట్టుటకు యేసు ఈ ఉపమానమును చెప్పలేదు. దాని ద్వారా ఆయన ఒక గొప్ప ఆత్మీయపాఠమును మనకు నేర్పించెను. ఆ చిన్నకుమారునివలె మనందరము పాపములో బడి తండ్రియైన దేవుని నుండి తప్పిపోయిన వారమైయున్నాము. మనము మారుమనస్సు నొంది తిరిగి దేవుని యొద్దకు చేరుకొనులాగున పరమందున్న ఆ తండ్రి మన యెడల మితిలేని ప్రేమను, దీర్ఘశాంతమును కలిగియున్నాడు. మనము విరిగి నలిగిన హృదయము కలిగి ఆయనయొద్దకు వచ్చిన యెడల ఆయన మనలను తన కుమారులనుగా స్వీకరించుటకు యెదురు చూచుచున్నాడు.

ఇంత చక్కని ఉపమానములను యేసు అనేకములను బోధించెను. ఆయన చెప్పిన ఉపమానములలో కొన్ని మాత్రమే క్రొత్తనిబంధనలో మత్తయి, మార్కు, లూకా, యోహాను అను సువార్తలలో మనకు కన్పడగలవు. విత్తువానిని గూర్చి ఆయన చెప్పిన ఉపమానము కూడ చాల గొప్పది. "విత్తువాడు తన విత్తనములు విత్తుటకు బయలుదేరెను. అతడు విత్తుచుండగా కొన్ని విత్తనములు

త్రోవప్రక్కను పడి త్రొక్కబడెను గనుక ఆకాశపక్షులు వాటిని మ్రింగివేసెను. మరి కొన్ని రాతినేలను పడి, మొలచి, చెమ్మలేనందున ఎండిపోయెను. మరికొన్ని ముండ్లపొదల నడుమపడెను. ముండ్లపొదలు, వాటితో మొలిచి వాటి నణచి వేసెను. మరికొన్ని మంచినేలను పడెను అవి మొలచి నూరంతలుగా ఫలించెను" అని యేసు చెప్పెను (లూకా 8:4-8). యేసు ఈ ఉపమానము యొక్క భావమును ఆయన శిష్యుల కిట్లు చెప్పెను. విత్తనము దేవుని వాక్యము. దేవుని వాక్యము విత్తబడుచుండగా వినుచున్నవారు నాలుగురకములైన హృదయమును కలిగినవారు. త్రోవప్రక్క నుండువారు వినువారుగాని నమ్మిరక్షణ పొందకుండు నట్లు అపవాది వచ్చి వారి హృదయములో నుండి వాక్య మెత్తుకొనిపోవును. రాతినేలనుండు వారెవరనగా వినునప్పుడు వాక్యమును సంతోషముతో అంగీకరించువారు గాని, కొంచెముకాలము నమ్మి, శోధనకాలమున తొలగి పోవుదురు. ముండ్లపొదలలో పడిన విత్తనమును పోలినవారెవరనగా, విని కాలము గడచినకొలదీ యీ జీవసంబంధమైన విచారములచేతను, ధనభోగముల చేతను అణచివేయబడి పరిపక్వముగా ఫలింపనివారు. మంచినేలనుండు విత్తనమును పోలిన వారెవరనగా యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారు (లూకా 8:11-15).

## ప్రశ్న - జవాబులతో

యేసు తన చుట్టూయున్న ప్రజలను ఒక్కోసారి ప్రశ్నించి ప్రయోజనాత్మక మైన పాఠములను నేర్పెను. ఒకనాడు ఆయన జనసమూహములతో మాటలాడుచుండగా ఆయన తల్లియు, ఆయన సహోదరులను ఆయనతో మాటలాడగోరుచు వెలుపల నిలిచియుండిరి. అప్పుడొకడు-ఇదిగో నీ తల్లియు, నీ సహోదరులను నీతో మాటలాడవలెనని వెలుపల నిలిచియున్నారని ఆయనతో చెప్పెను. అందుకాయన నా తల్లియెవరు ? నా సహోదరులెవరు ? అని చెప్పి తన శిష్యుల వైపు చెయ్యిచాపి - ఇదిగో నాతల్లియు నాసహోదరులును;

పరలోకమందున్న నాతండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నాతల్లియుననెను (మత్తయి 12:46-50).

యేసుయొక్క శత్రువులు ఆయనను శోధించుటకు ప్రశ్నలు వేస్తూయుండే వారు. వారి ప్రశ్నలపై తిరిగి ప్రశ్నలు వేస్తూ యేసు జవాబిచ్చుచుండెను. వారాయన ప్రశ్నలకు జవాబీయలేనియెడల వారి ప్రశ్నలకు ఆయన కూడ జవాబీయకుండెను. ఒకరోజు యేసు "దేవాలయములోనికి వచ్చి బోధించుచుండగా ప్రధాన యాజకులును, ప్రజలు పెద్దలును ఆయనయొద్దకు వచ్చి - ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు ? ఈ అధికారము ఎవడు నీకిచ్చెనని అడుగగా - యేసు నేనును మిమ్మును ఒకమాట అడుగుదును. అది మీరు నాతో చెప్పిన యెడల నేనును ఏ అధికారము వలన ఈ కార్యములు చేయు చున్నానో అది మీతో చెప్పుదును. యోహాను ఇచ్చిన బాప్తిస్మము ఎక్కడనుండి కలిగినది ? పరలోకము నుండి కలిగినదా ? మనుష్యులనుండి కలిగినదా ? అని వారినడిగెను. వారు - మనము పరలోకము నుండి అని చెప్పితిమా, ఆయన - అలాగైతే మీరెందుకు అతని నమ్మలేదని మనలనడుగును; మనుష్యుల వలనని చెప్పితిమా జనులకు భయపడుచున్నాము; అందరు యోహాను ప్రవక్తయని యెంచుచున్నారని తమలోతాము ఆలోచించుకొని - మాకు తెలియదని యేసునకు ఉత్తరమిచ్చిరి. అందుకాయన ఏ అధికారము వలన ఈ కార్యములు నేను చేయుచున్నానో అదియు మీతో చెప్పను" అని వారికి జవాబిచ్చెను (మత్తయి 21:23-27).

## ఉదాహరణలతో

ఒకరోజు దయ్యము పట్టిన గ్రుడ్డివాడును, మూగవాడునైన యొకడు యేసుయొద్దకు తేబడెను ఆయన వానిని స్వస్థపరచినందున ఆ మూగవాడు మాటలాడు శక్తియు, చూపును గలవాడాయెను. అందుకు ప్రజలు విస్మయ

మొంది - ఈయన దావీదు కుమారుడు కాడా, అని చెప్పుకొనుచుండిరి. పరిసయ్యులు ఆమాట విని - వీడు దయ్యములకు అధిపతియైన బయెల్జెబూలు వలననే దయ్యములను వెళ్లగొట్టుచున్నాడు గాని మరియొకనివలన కాదనిరి. ఆయన వారి తలంపుల నెరగి వారితో ఇట్లనెను - తనకుతానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడైపోవును. తనకుతానే విరోధముగా వేరుపడినయే పట్టణమైనను, ఏ యిల్లయినను నిలువదు. సాతాను సాతానును వెళ్లగొట్టిన యెడల తనకుతానే విరోధముగా వేరుపడును; అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును ? నేను బయెల్జెబూలు వలన దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల మీ కుమారులు ఎవరివలన వాటిని వెళ్లగొట్టుచున్నారు ? కాబట్టి వారే మీకు తీర్పరులై యుందురు. దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నదని చెప్పి యేసు వారి హృదయ తలంపులను ఖండించెను (మత్తయి 12:22-28).

యేసుక్రీస్తు ఈ లోకములో యుండగా అనేకరీతులుగ, ఉదాహరణల ద్వారాను, ఉపమానముల ద్వారాను, ప్రశ్న-జవాబుల ద్వారాను దేవుని రాజ్యమును గూర్చి ప్రజలకు బోధించెను. ఆయన బోధించునప్పుడు అధికారము గల వాని వలె బోధించెను. అందువలన జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడు చుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలెకాక అధికారము గలవానివలె వారికి బోధించెను (మత్తయి 7:29). యేసు దేవుని కుమారుడు గనుక సర్వాధికారియై యున్నాడు. మనము ఆయనను ఆయన బోధను అంగీకరించిన యెడల మోక్షమును ఆయన మనకు ప్రసాదించును. ఆయన బోధను మనము నిరాకరించిన యెడల నిత్య శిక్షమనకు తప్పదు. "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీ కరింపనివాడు; ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడని" వ్రాయబడియున్నది (2 యోహాను :9).

యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తునందున్న విశ్వాసమును మనుష్యులయెదుట ఒప్పుకొనుచూ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు యేసుప్రభువు నిన్ను తన రాజ్యమైన సంఘముతో చేర్చుకొనును.

-- జాషువా గూటం

❀❀❀

# "నడక"

హనోకు దేవునితో నడిచాడు
అబ్రహాము దేవునితో నడిచాడు
ఇస్సాకు ఇశ్రాయేలు దేవునితో నడిచాడు
ఇలా ఎందరో మనకు ముందున్నవారు
దేవునితో నడిచి ధన్యతలొందారు !
దేవుని కుమారుడైన యేసుక్రీస్తు బాధలొంది
తన అడుగుజాడల్లో నడుచేందుకు
క్రైస్తవులకు మాదిరి మార్గం ఉంచి వెళ్లాడు !

పరిశుద్ధులు విశ్వాసులు అనబడే వారెందరో
ప్రకృతి సంబంధులును ఆత్మరహితులునై
దారితప్పిన చుక్కలై ప్రక్కదార్లు పడుతున్నారు

దుర్లాభాలకై క్రీస్తు మార్గం వదిలి పరుగులెడుతున్నారు
దర్శనాలు భాషలు స్వస్థతావరాలంటూ .......
అవివేకులను ఆకర్షించుకుంటూ వ్యాపారం చేస్తున్నారు
అగ్నిలో నుండి లాగినట్లు కొందరిని కనికరించి
కరుణించి రక్షించండనిన పరిశుద్ధాత్మని వాక్కు విడిచి
పరలోక ద్వారాన్ని మూసివేస్తున్నారు
సత్యవాక్కు చదువరులారా నిత్యాగ్ని దండన ఉందని
అట్టివారికి గుర్తుచేస్తూ ........ ఆత్మపూర్ణులైన మీరు .......
ఆత్మల కాపరివైపు వారిని మళ్లించుట మరువకండి !

(కొలస్స 2:6-7; 1 పేతురు 2:21; యూదా 17-23 వచానాలు)

-- సామ్యూల్ జాన్ మేడిది,
కొటికలపాడ.

***


## క్రైస్తవ కీర్తనలు

237 పాటలు గల క్రైస్తవ కీర్తనలు పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక పాత, క్రొత్త కీర్తనలున్నవి. సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న కీర్తనలు కూడా యున్నవి. ఒక్కొక్క కాపీవెల 18 రూపాయలు. పోస్టేజీ 4 రూపాయలు అదనం. వలయువారు దిగువ చిరునామకు M.O పంపండి. M.O దిగువ కూపను మీద మీ అడ్రసు తప్పక వ్రాయండి:

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

2001 అక్టోబరు 14వ తేదీ ఉదయం సహో. డాక్టర్ జాన్ బెయిలీ అమెరికా నుండి మద్రాసు క్షేమముగా చేరుకొనిరి. 14,15 తేదీలలో ఆయన మద్రాసులో పీటర్‌సాల్మన్ గారితో కలిసి పనిచేసి, 16వ తేదీ ఉదయానికి కాకినాడ చేరుకొనిరి. జాన్ బెయిలీ గారు జె.సి. బెయిలీ గారి చిన్న కుమారుడు.

జాన్ బెయిలీ గారు 16వ తేదీ నుండి అనేక స్థానిక సంఘములు దర్శిస్తు సహోదరులు విశ్వాసమునందు నిలకడగా యుండవలెనని హెచ్చరించిరి. జాషువా గారితో కలిసి ఆయన పిఠాపురం (సీతయ్యతోట), కొండుకుదురు, తొత్తరమూడి, కొత్తకందరాడ, రామచంద్రపురం, ఆచంట, పెదగరువు, కరుగోరుమిల్లి, పార్వతీచెరువు, జగన్నాథగిరి, కందరాడ, పాలకొల్లు, మైలవరం, విజయవాడ ప్రాంతములలో సువార్త పరిచర్యగావించిరి. 21వ తేదీ ఆదివారం కాకినాడ రామారావ్‌పేటలోని క్రీస్తు సంఘములో వాక్యపరిచర్యచేసిరి. ఆ మధ్యాహ్నం రామచంద్రాపురం పదంవారి వీధిలో నిర్మించిబడిన ఆలయమును రిబ్బను కత్తిరించి తెరచిరి. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమమునకు మూడు వందలమంది హాజరైరి. అక్కడ సోదరులు యన్. లాజరస్ ఆయన కుమారుడు ప్రసాద్ గార్లు వాక్యపరిచర్య చేయుచున్నారు. అంతకుముందు 18వ తేదీ గురువారం రామచంద్రాపురం సువార్తపేటలోని లెప్పర్‌కోలనీ క్రీస్తు సంఘములో ఆయన వాక్య పరిచర్యచేసిరి. లెప్పర్‌కోలనీలో 65 కుటుంబముల వారికి సోదరులు టి.వి.యన్.కుమార్ గారు ప్రతిరోజు భోజనమునందించుచు, వారి మధ్య గొప్ప సువార్త పనిచేయుచున్నారు. క్రీస్తు ప్రేమను వారికి, లోకానికి గంభీరముగా చాటుచున్నారు.

2001 అక్టోబరు 19వ తేదీ శుక్రవారం కాకినాడ సత్యవాణి-క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. ఆర్.టి.సి. బస్సులు ఆనాడు బంద్‌లోయున్నను ఇంచుమించు 400ల మంది క్రీస్తుసంఘ సువార్తికులు ఆ సదస్సులో పాల్గొనిరి. ఆంధ్రప్రదేశ్ నలుమూలలనుండి వారు వచ్చి సకాలమునకు హాజరై, గొప్ప సహవాసములో పాల్గొందిరి. సోదరులు జాన్ బెయిలీగారు ముఖ్య అతిధిగా యుండి బైబిలు నుండి రెండు గొప్ప పాఠములనందించిరి. సోదరులు ఎస్.వి. రావ్ (మార్టేరు). టి. జ్ఞానానందం (కాకినాడ), పి. ప్రకాశం (హైదరాబాద్)

గార్లు కూడ క్లుప్త వాక్య పరిచర్యగావించిరి. ఆరోజు మధ్యాహ్నం జాషువా గారి కనిష్ఠ కుమారుడు రాబిన్ గూటం క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆయన మద్రాసులో ఇంజనీరింగ్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) చదువుచున్నారు. వచ్చిన వారందరికీ మంచి భోజనం ఏర్పాటు చేయబడెను. సువార్తికులు తిరిగి వెళ్లుచుండగా ప్రతివారికి కనీసం 500 సువార్త పత్రికలు, పుస్తకములు అందజేయబడెను.

డా. జాన్ బెయిలీ గారి పరిచర్య ద్వారా అక్టోబరు 16 నుండి ఈ పత్రిక ముద్రించు సరికి అనగా 26వ తేదీ వరకు 70 మంది క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. ఆయన అక్టోబరు 31వ తేదీనాడు అమెరికాకు తిరిగి వెళ్లుదురు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/05/2001

**From:**
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.